సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 16 । నవంబర్ । 2023



మహోన్నత వ్యక్తి బిర్సాముండా

స్వాతంత్య్రం కోసం పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి భగవాన్ బిర్సా ముండా అని ఎమ్మెల్యే ధనలక్ష్మి తెలిపారు. 8లో



గిరిజన చట్టాల పరిరక్షణకు కృషి

ఏజెన్సీలో గిరిజన చట్టాల పరిరక్షణకు కృషి చేస్తామని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. 8లో



తిరునక్షత్రం పూజలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో తిరునక్షత్రం పూజలు మూడోరోజు బుధవారం కొనసాగాయి.

న్యూస్‌రీల్

అప్పన్న సన్నిధిలో గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్‌కి అప్పన్న జ్ఞాపికను అందిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదాన్ని, జ్ఞాపికను దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అందజేశారు.

లోయలోకి దూసుకెళ్లిన ద్విచక్రవాహనం

- ఇద్దరికి తీవ్ర గాయాలు



క్షతగాత్రులను తరలిస్తున్న 108 సిబ్బంది

అనంతగిరి: లోయలోకి ద్విచక్రవాహనం దూసుకుపోవడంతో బొర్రా గుహలను తిలకించేందుకు వెళుతున్న ఇద్దరు పర్యాటకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం.. విశాఖపట్నం ప్రాంతానికి చెందిన సాయి కుమార్(28), శ్రావణి(23) అనే పర్యాటకులు బుధవారం సాయంత్రం ద్విచక్రవాహనంపై బొర్రా గుహలను ను తిలకించేందుకు వెళుతుండగా దొరగూడ సమీపంలో మలుపువద్ద వాహనం అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలోని ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. అటువైపుగా వెళుతున్న స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. ఈఎంటీ ప్రసాద్, పైలెట్ వీర్రాజు, ఘటనాస్థలానికి చేరుకుని, క్షతగాత్రులను ఎస్ కోట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నేడు మైనార్టీ కమిషన్ వినతుల స్వీకరణ

మహారాణిపేట(విశాఖ): ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనార్టీ కమిషన్ చైర్మన్ ఇక్బాల్ అహ్మద్ గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విశాఖ కలెక్టరేట్‌లో అందుబాటులో ఉంటారని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి సయ్యద్ సిరాజుల్ల ఓ ప్రకటనలో తెలిపారు. ఆయనతో పాటు కమిషన్ వైస్ చైర్మన్ ఆదిపి జాషువా డేనియల్, సభ్యులు సయ్యద్ హిదయతుల్లా, షేక్ సైపుల్లా, జితేందర్ సింగ్ కూడా కలెక్టరేట్‌కు వస్తున్నారు. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు తమ సమస్యలను కమిషన్‌కు రాత పూర్వకంగా నేరుగా అందజేయవచ్చని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రలోని మైనార్టీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సదస్సు

సాక్షి,పాడేరు: బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల అవగాహన సదస్సును గురువారం స్థానిక మోదకొండమ్మ ఆలయ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ ఎక్స్ఛేంజ్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్(పీఆర్ అండ్ లీగల్) పాల్ విలియం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు ఈసదస్సు జరుగుతుందని, వినియోగదారులంతా తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

జాతీయస్థాయి కుస్తీ పోటీలకు ముగ్గురు గురుకుల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కొయ్యూరు: స్థానిక గురుకుల జూనియర్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జాతీయ స్థాయి కుస్తీపోటీలకు ఎంపికయ్యారు. విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి వి.మహేష్ అండర్–19లో 57 కిలోల ఫ్రీస్టైల్ విభాగంలో, వి.రమేష్ 60 కిలోల విభాగంలో, అండర్–17లో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి పి.దార వీర ప్రసాద్ 55 కిలోల ఫ్రీ స్టైల్ విభాగంలో బంగారు పతకాలు సాధించారు. వచ్చేనెల ఢిల్లీలో జరిగే జాతీయ పోటీల్లో వీరు పాల్గొంటారని ప్రిన్సిపాల్ సూరిబాబు బుధవారం తెలిపారు. జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్,అధ్యాపకులు అభినందించారు.

అడవి బిడ్డలకు అండగా..



మొక్కను నాటుతున్న గవర్నర్ నజీర్

- గిరిజన సంక్షేమానికి ప్రభుత్వాల పెద్దపీట
- బిర్సా ముండా పోరాట పటిమ అందరికీ ఆదర్శం
- అరకులో వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు గవర్నర్ అబ్దుల్ నజీర్ శ్రీకారం



వేదికపై గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, కలెక్టర్ సుమిత్‌కుమార్, అరకు, పాడేరు ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీ, జీసీసీ చైర్‌పర్సన్‌లు సుభద్ర, డాక్టర్ స్వాతిరాణి

సాక్షి,పాడేరు/అరకులోయటౌన్: గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, ఇందుకోసం పలు పథకాలు అమలు చేస్తున్నాయని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. అరకులోయలో బుధవారం గవర్నర్ వికసిత్ భారత్ సంకల్పయాత్రను ప్రారంభించారు. ముందుగా భగవాన్ బిర్సాముండాతో పాటు ఇతర గిరిజన పోరాట యోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన గిరిజన సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ తెలుగులో కొద్ది సమయం ప్రసంగించారు. ఆహూతులను తెలుగులో సంబోధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బిర్సా ముండా పోరాట పటిమ అందరికీ ఆదర్శమన్నారు. గిరిజన స్వాతంత్య్ర సమరయోధుడు భగవాన్ బిర్సాముండా జయంతిని పురస్కరించుకుని ప్రారంభించిన జన్ జాతీయ గౌరవ్ దివాస్ 2023, వికసిత్ భారత్ సంకల్పయాత్రను జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలన్నారు. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ మంజూరు చేసిన 28 ఏకలవ్య పాఠశాలల్లో 24 పాఠశాలలను అల్లూరి జిల్లాలోని ఏర్పాటు చేశారని చెప్పారు. జిల్లాలో మూడు ప్రచార రథాల ద్వారా వికసిత్ భారత్ సంకల్పయాత్రకు శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటి వద్దే వైద్య సేవలందించడంతో ప్రజలకు సత్వర వైద్యం అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ మంజూరు చేసిన దారకొండ అంబులెన్స్, మూడు ప్రచార వాహనాలను ఆయన ప్రారంభించారు. ఐదు గిరిజన ఉప తెగల భాషలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. పోడు భూములకు పట్టాలు, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద గ్యాస్ కనెక్షన్లను గవర్నర్ పంపిణీ చేశారు. అనంతరం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాల నాయుడు మాట్లాడుతూ గిరిజన సంప్రదాయాలు, హక్కుల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు చేపడుతున్నాయన్నారు. కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను గిరిజనులకు సంపూర్ణంగా అందజేస్తున్నామని చెప్పారు. గవర్నర్ ప్రారంభించిన మూడు ప్రచార వాహనాలు జిల్లాలోని 430 గ్రామ పంచాయతీల్లో పర్యటిస్తాయని తెలిపారు. ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ అరకు నియోజకవర్గంలో మారుమూల గ్రామాలకు రూ. 600 కోట్లతో 317 రోడ్లు నిర్మించామని, 200 సెల్ టవర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. కాఫీ, మిరియాల సాగు చేపట్టి గిరిజనులు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఐటీడీఏ పరిధిలో స్పెషల్ డీఎస్సీ ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని గవర్నర్‌ను కోరా రు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన గిరిజనులకు ప్రభుత్వాలు ప్రత్యేక స్థానం కల్పిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రధానాధికారి అజయ్ జైన్, గిరిజన సంక్షేమ సంచాలకులు మురళి, సంయుక్త కలెక్టర్ శ్రీనివాస్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, ఎస్పీ తుహిన్ సిన్హా, ఏఎస్పీ ధీరజ్, ట్రైకార్ డైరెక్టర్ రవీంద్రబాబు, ఐటీడీఏ ఏపీవోలు ప్రభాకర్, వెంకటేశ్వరరావు, డీఆర్వో అంబేడ్కర్ పాల్గొన్నారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు థింసా నృత్యంతో స్వాగతం పలుకుతున్న గిరిజన మహిళలు

ప్రశాంతంగా ముగిసిన పర్యటన

రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అరకులోయ పర్యటన ప్రశాంతంగా జరిగింది. గవర్నర్ అరకులోయ పర్యటనతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. విశాఖ నుంచి అరకులోయలోని యండపల్లివలస రైల్వే అతిథిగృహం వరకు భారీగా భద్రతా చర్యలను చేపట్టారు. పోలీసుశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎస్పీ తుహిన్‌సిన్హా బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతగిరి–అరకులోయ ఘాట్‌లో కూడా ప్రత్యేక పోలీసు బలగాలు మోహరించాయి. వాహనాల తనిఖీలను చేపట్టారు.అరకులోయ పట్టణంలోని అన్ని రోడ్లలోను పోలీసులు బందోబస్తు నిర్వహించారు. సభావేదిక వద్ద కూడా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

గవర్నర్‌కు ఘన స్వాగతం



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

సాక్షి,పాడేరు/అరకులోయటౌన్: తొలిసారిగా అరకులోయలో పర్యటించిన గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు గిరిజన ప్రజాప్రతినిధులు,అధికారులు ఘనస్వాగతం పలికారు.గిరిజన మహిళలు థింసా నృత్యంతో గవర్నర్‌కు ఆత్మీయంగా స్వాగతం పలుకుతూ సభ వేదిక వద్దకు తీసుకువచ్చారు. గవర్నర్ మొక్కలు నాటడంతో పాటు వన్‌ధన్ యోజన, జీసీసీ స్టాళ్లను పరిశీలించారు. దారకొండ పీహెచ్‌సీ కోసం రెడ్‌క్రాస్ నిధులతో కొనుగోలు చేసిన అంబులెన్స్‌ను గవర్నర్ ప్రారంభించారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు, కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యేలు చెట్టిపాల్గుణ, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఉమ్మడి విశాఖ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, ఎస్పీ తుహిన్ సిన్హా, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ నర్సింగరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శెట్టి గంగాధర్ స్వామి, అప్పాలు, సంపత్, సాంబ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీసుల నుంచి గవర్నర్ గౌరవ వందనం స్వీకరించారు.

ఆర్వోఎఫ్ఆర్ పట్టాలతో హక్కుదారులమయ్యాం



మాట్లాడుతున్న సన్యాసమ్మ

అరకులోయ టౌన్: గిరిజన సదస్సు వేదికపై పలువురు గిరిజనులు మాట్లాడుతూ ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ చేసి రాష్ట్ర ప్రభుత్వం తమను ఆదుకుందని తెలిపారు. చాలా ఏళ్లగా సాగుచేస్తున్న భూములకు హక్కుదారులమయ్యాని సంతోషం వ్యక్తం చేశారు. అరకులోయ మండలంలోని చొంపి పంచాయతీ కొత్తవలసకు చెందిన జి.సన్యాసమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోడు భూములకు పట్టాలిచ్చి ఆదుకుందని తెలిపింది. 25 ఏళ్లగా తమ భూముల్లో చోడి, సామ, గంటెలు పండిస్తున్నామని, పట్టాలు ఇవ్వడంతో ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం వచ్చిందని చెప్పింది. సుంకరమెట్ట పంచాయతీ పెదగంగగుడ్డి గ్రామానికి చెందిన బురిడి రాధ మాట్లాడుతూ ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పంపిణీ చేసిన తరువాత కాఫీ, మిరియాలు సాగు చేస్తున్నట్టు చెప్పింది. మాగడగ గ్రామానికి చెందిన పెదమజ్జి అర్జున్ మాట్లాడుతూ గతంలో పంటలు పండించేందుకు అప్పులు చేసేవారమని, ఇప్పుడా పరిస్థితి లేదని తెలిపాడు. ప్రభుత్వాలు తమను దళారుల నుంచి కాపాడాయని చెప్పాడు.

పోర్టు మరో మైలురాయి

- 228 రోజుల్లో 50 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకు హ్యాండ్లింగ్
- పోర్టు ఏర్పడిన 90 ఏళ్లలో ఇదే అతిపెద్ద నిర్వహణ
- ఈ ఏడాది 83 మిలియన్ ఎంటీ లక్ష్యాన్ని చేరుకునే దిశగా పరుగులు
- బెర్తుల ఆధునికీకరణతో అత్యుత్తమ ఫలితాలు



సాక్షి, విశాఖపట్నం : ఈస్ట్ కోస్ట్ గేట్‌వే ఆఫ్ ఇండియాగా నౌకాయానంలో అంతర్జాతీయంగా ఎదుగుతున్న విశాఖపట్నం పోర్టు అథారిటీ.. సరకు రవాణాలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. పోర్టు చరిత్రలోనే అతి పెద్ద మైలు రాయిని అధిగమిస్తూ.. సరకు రవాణాలో ఏటికేడూ వృద్ధిలో దూసుకుపోతోంది. కేవలం 228 రోజుల్లోనే 50 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకు హ్యాండ్లింగ్ చేస్తూ అతి తక్కువ రోజుల్లోనే ఈ ఘనత సాధించింది. బెర్తుల ఆధునికీకరణతో ఈ ఏడాది నిర్దేశించుకున్న 83 మిలియన్ మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని చేరుకునే దిశగా పరుగులు పెడుతోంది.

వచ్చే రెండేళ్లలో నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు మౌలిక వసతుల కల్పన, జెట్టీల విస్తరణ ఇతర అభివృద్ధి పనులతో విశాఖపట్నం పోర్టు అథారిటీ ఎప్పటికప్పుడు కొత్త రికార్డులు నమోదు చేసుకుంటోంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో విశాఖపట్నం పోర్టు అథారిటీ కేవలం 228 రోజుల్లో 50 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకును రవాణా చేసి నూతన రికార్డును నెలకొల్పింది. గతంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో 50 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకును హ్యాండిల్ చేసేందుకు 251 రోజుల సమయం పట్టింది. ట్రాఫిక్ మేనేజర్ రత్నశేఖర్ నేతృత్వంలో ఈ ఘనతని అందుకుంది. పోర్టు ఏర్పడిన 90 ఏళ్లలో ఇదే అతి తక్కువ రోజుల్లో చేరుకున్న ఘనత కావడం విశేషం.

బెర్తుల ఆధునికీకరణతో...

విశాఖపట్నం పోర్టు పరిధిలో యాంత్రీకరణ పనులను పీపీపీ పద్ధతిలో నిర్వహిస్తున్నారు. ఈక్యూ 7, డబ్ల్యూ క్యూ 7, 8, డబ్ల్యూక్యూ 6 మూడు బెర్త్‌లను యాంత్రీకరించే పనిని విశాఖపట్నం పోర్టు చేపట్టింది. ఇందుకోసం పోర్టు రూ.655 కోట్లు కేటాయించింది. ఇలా ఎప్పటికప్పుడు యాంత్రీకరణ, ఆధునికీకరణ పనుల్ని నిర్వహిస్తూ రికార్డులను నమోదు చేయడంలో పోర్టు తనదైన మార్కుని చూపిస్తోంది.

లక్ష్యాన్ని చేరుకునే దిశగా అడుగులు



వీపీఏలో నిబద్ధతతో కూడిన సిబ్బంది, పిపిపి ఆపరేటర్లు, వ్యాపార భాగస్వాముల సహకారంతో వివిధ విభాగాల సరకు హ్యాండ్లింగ్‌లో రికార్డులను అధిగమిస్తున్నాం. 2023–24 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న 83 మిలియన్ మెట్రిక్ టన్నుల హ్యాండ్లింగ్ రికార్డును చేరుకునే దిశగా అడుగులు వేస్తున్నాం. బెర్తుల ఆధునికీకరణ పనులను వేగవంతం చేస్తున్నాం. కొద్ది నెలల్లో ఆధునిక పోర్టుగా రూపుదిద్దుకోనుంది.

– డా.అంగముత్తు, వీపీఏ చైర్మన్

20న యలమంచిలి..30న అరకులోయ



సమావేశంలో మాట్లాడుతున్న రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

- 18న విశాఖ తూర్పులో...
- నేటి నుంచి రెండో విడత సాధికార యాత్ర
- వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి
- విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపు

సాక్షి, విశాఖపట్నం/కొమ్మాది: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం నుంచి 30వ తేదీ వరకు జరగనున్న రెండో విడత సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సామాజిక సాధికార మొదటి విడత బస్సు యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. అదే ఉత్సాహంతో నరసన్నపేట నుంచి రెండో విడత యాత్ర బుధవారం నుంచి ప్రారంభమైందన్నారు. ఎండాడలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో రెండవ విడత సామాజిక సాధికార యాత్ర ఉత్తరాంధ్ర షెడ్యూల్ విడుదల చేశారు. గురువారం రాజాం, 18న విశాఖ తూర్పు, 20న యలమంచిలి, 21న పాతపట్నం, 22న విశాఖ దక్షిణ, 23న బొబ్బిలి, 24న పాలకొండ, 25 పెందుర్తి, 27 ఎచ్చెర్ల, 28న నెల్లిమర్ల, 29న కురుపాం, 30న అరకులోయలో ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నట్లు చెప్పారు. యాత్రలో భాగంగా నాడు–నేడు పనులను పరిశీలిస్తున్నామని.. ఎక్కడైనా లోపాలుంటే సరి చేయాలని అధికారులకు వివరిస్తున్నామన్నారు. జనసేన నాయకుల విమర్శలకు సమాధానం ఇవ్వాల్సిన పనిలేదన్నారు. నాడు–నేడు ద్వారా జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆ పార్టీ నాయకులు బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్ని పార్టీలు కలిసి పోటీ చేసినా అంతిమ విజయం వైఎస్సార్ సీపీదేనన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్సీ సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి, మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, వాసుపల్లి గణేష్‌కుమార్, సమన్వయకర్త కె.కె.రాజు, పార్టీ ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు, పార్టీ కార్యాలయం పర్యవేక్షకుడు రవిరెడ్డి, పేడాడ రమణికుమారి, ద్రోణంరాజు శ్రీవత్సవ తదితరులు పాల్గొన్నారు.

ఎగసిన అభిమానం







విశాఖ స్పోర్ట్స్: క్రికెట్ అభిమానుల కేరింతల ముందు సాగర ఘోష చిన్నబోయింది. వాంఖడే మైదానంలో సిక్సర్లు, ఫోర్ల మోత మోగుతుంటే.. తీరంలో అభిమానుల కోలాహలం అంబరాన్ని తాకింది. క్రికెట్ అభిమానులతో విశాఖ తీరం జన సంద్రంగా మారింది. ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌ను చివరి వరకు తనివితీరా ఆస్వాదించారు. భారత్–న్యూజిలాండ్‌ల మధ్య బుధవారం జరిగిన ప్రపంచ కప్ సెమీ ఫైనల్ మ్యాచ్‌ను ఆర్కే బీచ్‌లో ఆంధ్రా క్రికెట్ సంఘం భారీ స్క్రీన్‌పై ప్రత్యక్ష ప్రసారం చేసింది. తొలిసారిగా అభిమానుల ప్రాంగణం పేరిట ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్లపై మ్యాచ్‌ను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. ఫ్లడ్‌లైట్లతో పాటు అభిమానులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక టెంట్లు, ఫుడ్‌కోర్టులను ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా కేరళ సంప్రదాయ వాయిద్య బృందాలను ఏర్పాటు చేసి అభిమానులను ఉత్సాహపరిచారు. ఇంతమంది మధ్య మ్యాచ్ చూస్తే.. మైదానంలో మ్యాచ్‌ను చూసిన ఫీల్ కలిగిందని అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు. విరాట్ కోహ్లి 50వ శతకం పూర్తి చేసిన సందర్భంలో అయితే కింగ్ కోహ్లి నినాదాలతో ప్రాంగణం దద్దరిల్లిపోయింది. భారత్ జట్టు అఖండ విజయం సాధించి ఫైనల్‌కు చేరడంతో విశాఖ నగర ప్రజలు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యం

ఏయూ వీసీ ప్రసాదరెడ్డి



వేడుకల్లో పాల్గొన్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: స్వయం సమృద్ధి సాధించే దిశగా ఏయూను నడిపించడమే లక్ష్యంగా అందరూ సమష్టిగా పనిచేయాలని వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి పిలుపునిచ్చారు. నాక్ ఏ డబుల్ ప్లస్ గ్రేడ్ సాధించిన నేపథ్యంలో బుధవారం పరిపాలన భవనం ఎదురుగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఏయూపరిపాలన భవనంలో పనిచేస్తున్న ఐదు వందల మందితో కలిసి ఈ విజయాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ వర్సిటీ చుట్టూ ఏర్పాటు చేసిన ఇంక్యుబేషన్ పార్కులు భవిష్యత్‌లో ఏయూకు ఆర్థిక వనరులుగా మారతాయన్నారు. వర్సిటీ ఆచార్యులు, ఉద్యోగులు, విద్యార్థులు వర్సిటీ నాది అనే భావనతో పనిచేయడం తాను గమనించానన్నారు. నాలుగేళ్ల పటిష్ట ప్రణాళిక మంచి ఫలితాన్ని అందించిందన్నారు. విభిన్న శాఖలు కలిగిన ఏయూ 3.74 సీజీపీఏ సాధించడం ఓ రికార్డ్‌గా నిలుస్తుందన్నారు. పూర్తిస్థాయిలో వర్సిటీని అభివృద్ధి చేయడానికి అవసరమైన శక్తి.. రాష్ట్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపంలో తనకు లభించిందన్నారు.ఈ సందర్భంగా టపాసులు కాల్చి వేడుకలు జరుపుకున్నారు.

క్లుప్తంగా

భీమిలి బీచ్‌లో అల్లరి నరేష్ సందడి

కొమ్మాది: భీమిలి బీచ్‌లో బుధవారం సినిమా షూటింగ్ చేశారు. చిలక ప్రొడక్షన్ బ్యానర్‌పై మల్లి దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న ఓ సినిమాకు (టైటిల్ ఖరారు కాలేదు) సంబంధించిన కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. హీరో అల్లరి నరేష్, హీరోయిన్ ఫరియా అబ్దుల్లా (జాతిరత్నాలు ఫేమ్), వెన్నెల కిషోర్‌పై కొన్ని సన్ని వేశాలు చిత్రీకరించారు. ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ షూటింగ్ లొకేషన్‌కు చేరు కుని హీరో అల్లరి నరేష్‌తో కాసేపు ముచ్చటించారు. సినిమా విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

నాలుగు వరి కుప్పలు దగ్ధం



మంటలను ఆర్పుతున్న గిరిజనులు

అరకులోయ రూరల్: సుంకరమెట్ట పంచాయతీ దుక్కగూడలో బుధవారం తెల్లవారుజామున సీహెచ్ గురుమూర్తి,కొర్రా కొండ,పొట్టంగి మొద్దు,కొర్రా రాము అనే నలుగురు రైతులకు చెందిన నాలుగు వరి కుప్పలు దగ్ధమయ్యాయి. కల్లంలో కుప్పలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టి ఉండవచ్చని బాధితులు అనుమానం వ్యక్తం చేశారు. ఆదుకోవాలని కోరారు.

వేధింపులు తాళలేక బాలిక ఆత్మహత్య

పీఎం పాలెం: ప్రేమ పేరుతో వేధిస్తున్న యువకుడి ఆగడాలు తాళలేక ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సీపట్నం ప్రాంతానికి చెందిన గుర్రం కృష్ణారావు నగరానికి వలస వచ్చి కొమ్మాది సాయిరాం కాలనీలోని డ్రైవర్స్ కాలనీలో కుటుంబంతో నివసిస్తున్నాడు. అతనికి ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. నర్సీపట్నం ప్రాంతానికి చెందిన నక్కా భరత్ అలియాస్ సాగర్ అనే యువకుడు ఆ బాలికను ప్రేమిస్తున్నానని కొన్నాళ్లుగా వెంబడిస్తూ వేధిస్తున్నాడు. ఆ ఆగడాలు తాళలేక తాను అనుభవిస్తున్న నరకయాతనను తండ్రి వద్ద మొరపెట్టుకుంది. కుటుంబ సభ్యులు భరత్‌ను రప్పించి కౌన్సెలింగ్ చేశారు. అయినప్పటికీ భరత్ పంథా మార్చుకోలేదు. మరింతగా వెంబడించి వేధించడంతో ఈ నెల 14న రాత్రి తండ్రి వద్ద మరోమారు మొరపెట్టుకుంది. భయపడ వద్దని, గట్టిగా బుద్ధి చెబుతానని తండ్రి ఓదార్చాడు. ఈ నేపథ్యంలో రాత్రి భోజనం తర్వాత ఒకే గదిలో అక్కతో కలిసి నిద్రపోయింది. బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు చూసేసరికి ఆ బాలిక ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతోంది. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయగా కిందకు దించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మహోన్నత వ్యక్తి బిర్సాముండా



రంపచోడవరంలో జరిగిన బిర్సా ముండా జయంతి వేడుకల్లో జ్యోతిప్రజ్వలన చేస్తున్న పీవో సూరజ్ గనోరే, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



పాడేరులో గిరిజన సంప్రదాయం కొమ్మును ధరించిన పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

– రంపచోడవరం, పాడేరు ఎమ్మెల్యేలు నాగులపల్లి ధనలక్ష్మి, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

రంపచోడవరం: స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి భగవాన్ బిర్సా ముండా అని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గానోరే అన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశం హాలులో భగవాన్ బిర్సా ముండా 149వ జయంతిని బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే, ఐటీడీఏ పీవోలతో పాటు డివిజనల్ ఫారెస్ట్ అధికారి జి.నరేంద్ర, ఏఎస్పీ ఎ.జగదీష్ పోరాట యోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను అర్హులైన అందరికీ అందజేస్తున్నట్టు చెప్పారు. జిల్లాలోని సచివాలయాల్లో ఉద్యోగాలన్నీ గిరిజనులకే ఇచ్చినట్టు తెలిపారు. ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను అర్హులందరికీ మంజూరు చేస్తున్నట్టు చెప్పారు.

అనంతరం పేదలకు మంజూరు చేసిన ఉచిత గ్యాస్ కనెక్షన్‌లను ఎమ్మెల్యే, ఐటీడీఏ పీవో పంపిణీ చేశారు. రంపచోడవరం డివిజన్‌లో 70, చింతూరు డివిజన్‌లో 60 గ్యాస్ కనెక్షన్లు ఉచితంగా అందజేసినట్టు పీవో తెలిపారు. మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ. 73.33 కోట్ల చెక్కును ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే అందజేశారు. అర్హులైన 194 మంది గిరిజన రైతులకు సబ్సిడీపై మంజూరు చేసిన స్ప్రేయర్లు పంపిణీ చేశారు. అంతకుముందు ఐటీడీఏ కార్యాలయం నుంచి పాత దేవి గుడి వరకు కొమ్ముడోళ్లు, రేల నృత్యాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొన్న బందపల్లి గ్రామానికి చెందిన కారం తమన్నదొర కుటుంబ సభ్యులైన కారం శ్రీరాములు, కారం జగదాంబలను ఎమ్మెల్యే, పీవోలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మంగా బొజ్జయ్య, సర్పంచ్ లక్ష్మి, ఎంపీపీ బంధం శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కె.బాలకృష్ణ, ఎంపీటీసీలు ఉలవల లక్ష్మి, తుర్రం వెంకటేశ్వర్లు దొర, గిరిజన సంఘం నాయకులు కె.ఆదిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్ రాజ్, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.డేవిడ్ రాజ్, జీసీసీ డివిజనల్ మేనేజర్ జి.పార్వతీశ్వరరావు, తహసీల్దార్ పి.వి.వి.జయ కుమార్, ఎంపీడీవో హరికృష్ణ, సీడీపీవో సంధ్యారాణి, వెలుగు ఏపీడీ ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి, పాడేరు: గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సాముండా జయంతి ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి.ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో బిర్సాముండా జయంతి వేడుకలు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గిరిజన హక్కులు, చట్టాల పరిరక్షణపై చర్చించారు. సాయంత్రం బిర్సాముండా చిత్రపటంతో పాడేరులో ర్యాలీని ఘనంగా నిర్వహించారు. థింసా నృత్యాలు హోరెత్తాయి. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రలు కొమ్ములు ధరించి సందడి చేశారు. ఆదివాసీ జేఏసీ నేతలు డాక్టర్ తమర్భ బాబూరావునాయుడు, రామారావుదొర, ముఖీ శేషాద్రి, ఎస్.గంగరాజు, గంగన్నపడాల్, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్భ నరసింగరావు, మోదకొండమ్మ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహచలంనాయుడు, మహిళా ప్రతినిధులు గిడ్డి వరలక్ష్మి, సీహెచ్.రమాదేవి పాల్గొన్నారు.

అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం డైరెక్టర్‌గా వెంకటేశ్వరరావు

కె.కోటపాడు: విశాఖపట్నానికి చెందిన బి.ఆర్.అంబేద్కర్ మెమోరియాల్ సొసైటీ(ఏ.ఎం.ఎస్) డైరెక్టర్‌గా కె.కోటపాడు సబ్ రిజిస్ట్రార్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు బంగారి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఏఎంఎస్‌లో మెంబర్‌గా ఉన్న వెంకటేశ్వరరావు చేస్తున్న సామాజిక కార్యక్రమాలను పరిగణనలోనికి తీసుకొని పాలకవర్గం డైరెక్టర్ స్థానానికి తనను ఎంపిక చేసినట్టు వెంకటేశ్వరరావు తెలిపారు. నియామక పత్రాన్ని ఏఎంఎస్ అధ్యక్షుడు బొడ్డు కళ్యాణరావు చేతుల మీదుగా మంగళవారం ఆయన అందుకున్నారు.



నియామక పత్రం అందుకుంటున్న వెంకటేశ్వరరావు

140 కిలోల గంజాయి పట్టివేత

- నలుగురు కేరళవాసుల అరెస్టు.. ఒకరు పరార్
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ రాణా

నర్సీపట్నం: వాహనంలో తరలిస్తున్న 140 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నలుగురు వ్యక్తులను అరెస్టు చేశామని ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. రూరల్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ వివరాలు తెలిపారు. రూరల్ ఎస్ఐ ధనుంజనాయుడు, సిబ్బంది నెల్లిమెట్ట జంక్షన్ వద్ద బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు.



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

చింతపల్లి వైపు నుంచి కేరళ రిజిస్ట్రేషన్‌కు చెందిన బెలినో కారు వస్తుండగా తనిఖీ చేయడంతో గంజాయి బయటపడిందన్నారు. కారులో ఉన్న రూ.2.80 లక్షల విలువ గల 140 కిలోల గంజాయి బస్తాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ గంజాయి కేరళలో రూ.14 నుంచి రూ.15 లక్షలు ఉంటుందన్నారు. గంజాయి రవాణా చేస్తున్న కేరళకు చెందిన అరుణ్ (27), రేంజు (42), ఆనంద్(23), గూడెంకొత్తవీధి మండలం, ధారకొండకు చెందిన కొర్ర అర్జున్‌లను అరెస్టు చేశామన్నారు. మరొకరు పరారయ్యారని తెలిపారు. నిందితుల నుంచి మూడు సెల్‌ఫోన్లు, రూ.3 వేలు నగదు స్వాధీనం చేసుకుని, వారిని రిమాండ్‌కు తరలించామన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో క్లరికల్, టెక్నికల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 17న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపోలో ఫార్మసీస్, వరుణ్ మోటర్స్, శ్రీరామ్ చిట్స్, ముత్తూట్ ఫైనాన్స్, టాటా క్యాపిటల్, దక్కన్ ఫైన్ కెమికల్స్, స్పెక్ట్రమ్ టాలెంట్ మేనేజ్‌మెంట్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 500 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. రిటైల్ ట్రైనింగ్ అసోసియేట్, ఫార్మాసిస్ట్, జూనియర్ ట్రైనీ, డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ అసిస్టెంట్, అకౌంట్స్, అసిస్టెంట్, రికవరీ, క్లర్క్, బ్రాంచ్ ఇన్‌చార్జి, వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్స్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీ, 18–35 ఏళ్ల వయసు గల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

కారులో మంటలు



కారు నుంచి ఎగిసిపడుతున్న మంటలు

అనకాపల్లిటౌన్: కొత్తూరు జాతీయ రహదారిపై బుధవారం ఓ కారు ముందుభాగం అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. ఘటనకు సంబంధించి అగ్నిమాపక అధికారి బి.నరసింగరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. రాజమండ్రి కపిలేశ్వరం నుంచి గాజువాక వైపు వెళ్తున్న కారు ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో మంటలు చెలరేగాయన్నారు. సమాచారం మేరకు ఘటనాస్థలికి వెళ్లి, తమ సిబ్బంది సహాయంతో మంటలు అదుపు చేశామని చెప్పారు. యజమాని నవీన్ కారు నుంచి బయటకు దూకడంతో సురక్షితంగా బయటపడ్డాడని ఆయన తెలిపారు. ప్రమాదంలో సుమారు రూ.3 లక్షలు ఆస్తినష్టం జరిగిందన్నారు.

వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం

కోటవురట్ల: కోటవురట్లలోని సంతబయల వద్ద రెల్లి కాలనీలో ఉన్న రడీమెడ్ వస్త్ర దుకాణంలో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. సుమారు రూ.15 లక్షల మేర ఆస్తి నష్టం జరిగింది. విద్యుత్ షార్టు సర్క్యూట్ ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు. బాధితుడు పుచ్చల ఈశ్వరరావు అందించిన వివరాల ప్రకారం..రెల్లి కాలనీలో ఉన్న పుచ్చల రడీమేడ్ వస్త్ర దుకాణంలో ఉదయం 8.30 గంటల సమయంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మూసి ఉన్న దుకాణంలో ఉన్న విలువైన రడీమెడ్ వస్త్రాలు, గిఫ్ట ఆర్టికల్స్, పాదరక్షలు అగ్నికి ఆహుతయ్యాయి. దుకాణం ఇంకా తెరవకముందే ప్రమాదం జరిగింది. ప్రమాద విషయం తెలిసిన వెంటనే అనకాపల్లి నుంచి అగ్నిమాపక దళ సిబ్బంది శకటాలతో పాటు వచ్చి మంటలను అదుపు చేశారు.



ప్రమాదంలో కాలిపోయిన వస్త్ర దుకాణం

ప్రమాదం వల్ల సుమారు రూ.15 లక్షల వరకు నష్టం కలిగిందని బాధితుడు ఈశ్వరరావు వాపోయారు. ఏడేళ్లగా ఇక్కడ దుకాణం నడుపుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నానని, అగ్ని ప్రమాదం తీవ్ర నష్టాన్ని కలిగించిందని ఆవేదన చెందారు. ప్రభుత్వం తమకు పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

అప్పన్న హుండీలో సెక్యూరిటీ గార్డు నగదు చోరీ

విధుల నుంచి తొలగించిన దేవస్థానం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి తొలి పావంచా వద్ద(కొండ దిగువ) విధులు నిర్వర్తిస్తున్న ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు హుండీలోని నగదు చోరీ చేశాడు. అతనిపై దేవస్థానం అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు విధుల నుంచి తొలగించారు. దేవస్థానంలో సెక్యూరిటీ బాధ్యతలు నిర్వర్తిస్తున్న రాపిడ్ ప్రొటెక్షన్ ఫోర్స్ సంస్థకు చెందిన గార్డు ఎస్.అప్పలరాజు తొలిపావంచా వద్ద పనిచేస్తున్నాడు. ఈ నెల 14వ తేదీ మంగళవారం మధ్యాహ్నం తొలిపావంచా వద్ద ఉన్న హుండీలో చేయి పెట్టి రూ.1153 తీసి దాని వెనుక వేశాడు. దీన్ని కొందరు వీడియో తీసి దేవస్థానం అధికారులకు పంపించారు. దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి ఆదేశాలతో ఈఈ రాంబాబు, ఏఈ హరి తొలి పావంచా వద్ద విచారించారు. విచారణలో అప్పలరాజు హుండీలో నుంచి నగదు తీసినట్టు ఒప్పుకున్నాడు. దీంతో అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేసి విధుల నుంచి తొలగించారు.

గిరిజన చట్టాల పరిరక్షణకు కృషి

చింతూరు ఐటీడీఏ పీవో చైతన్య

చింతూరు: ఏజెన్సీలో గిరిజన చట్టాల పరిరక్షణకు ఎల్లప్పుడూ కృషి చేస్తామని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. బిర్సాముండా జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో, ప్రజా ప్రతినిధులు, ఆదివాసీ నాయకులు, అధికారులు బిర్సాముండాతో పాటు ఇతర ఆదివాసీ సమరయోధుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పీవో మాట్లాడుతూ గిరిజన హక్కుల సాధనకు కృషి చేసిన పోరాటయోధుడు బిర్సాముండా అని తెలిపారు. ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుల సమకాలికులు, వారసులను పీవో ఘనంగా సత్కరించారు. ఐటీడీఏ నుంచి గురుకుల పాఠశాల ఆవరణ వరకు గిరిజన సంప్రదాయ పద్ధతిలో ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన వివిధ శాఖల స్టాళ్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ యడమ అర్జున్, సర్పంచ్ కారం కన్నారావు, ఏపీవో కంచర్ల సుజాత, ఆదివాసీ సంఘాల నాయకులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వాతంత్య్ర సమరయోధుల సమకాలికుడు వెంకటరావును సన్మానిస్తున్న పీవో చైతన్య



గిరిజన సంప్రదాయాలతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

50 మందికి కంటి శస్త్రచికిత్సలు

హుకుంపేట: కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి కంటి ఆపరేషన్ నిమిత్తం విశాఖలోని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలిస్తున్నట్లు డిస్ట్రిక్ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ విశ్వేశ్వరరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష, డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు, కంటి పరీక్ష శిబిరంలో ఆయన పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా ఇటీవల జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి బుధవారం కంటి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వైద్య శిబిరంలో మొత్తం 67 మంది ప్రత్యేక పరీక్షలు చేయగా, 50 మందికి శస్త్రచికిత్సలు అవసరమున్నట్టు గుర్తించామని, వారిని విశాఖపట్నం ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గిరిజనులకు ఈ సదుపాయం కల్పించామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పేదలకు మంచి మేలు జరుగుతోందన్నారు. స్థానిక వైద్యాధికారి డాక్టర్ గాయత్రి, సిబ్బంది పాల్గొన్నారు.



కంటి శస్త్రచికిత్సల నిమిత్తం రోగులను ప్రత్యేక వాహనంలో విశాఖకు తరలిస్తున్న దృశ్యం

ఎమ్మెల్సీ రఘురాజుకు ఘన స్వాగతం

నక్కపల్లి: జయహో జగనన్న పేరుతో రాబోయే సాధారణ ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగనన్నే ఎన్నికవ్వాలని కోరుతూ ఎస్.కోట నుంచి తిరుమలకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేస్తున్న పాదయాత్ర బుధవారం నక్కపల్లికి చేరుకుంది. ఈ పాదయాత్రకు నక్కపల్లి నుంచి దేవవరం వరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. నక్కపల్లిలో ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయల అభివృద్ధి సంస్థ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, సింహాచల దేవస్థానం మెంబర్ శేషారత్నం, వేంపాడు వద్ద పీఏసీఎస్ అధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహమూర్తి, ఉద్దండపురం వద్ద మాజీ మంత్రి వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత పసుపులేటి బాలరాజు, జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, గొడిచర్ల పీఏసీఎస్ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు, సర్పంచ్ వెంకటేష్, ఎంపీటీసీ తిరుపతిరావు, చంద్రరావు ఘన స్వాగతం పలికారు. ఉద్దండపురం వద్ద అల్పాహారం చేసిన తర్వాత యాత్ర కొనసాగించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చిన పేర్రాజు, పార్టీ నాయకులు సురేష్‌రాజు, నాగ అప్పలరాజు,సత్తిబాబు, వీసం రాజు, ముద్దా శ్రీను పాల్గొన్నారు.

నామవరంలో...

పాయకరావుపేట: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరలా రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలన్న నినాదంతో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు చేస్తున్న పాదయాత్ర బుధవారం రాత్రి మండలానికి చేరుకుంది. నామవరం గ్రామం వద్ద స్థానిక నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఏఎంసీ వైస్‌చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు రఘురాజుకు శాలువా కప్పి స్వాగతం పలికారు. తిరుపతి వరకు 820 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టి, జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం నాడు వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడం జరుగుతుందని రఘురాజు తెలిపారు. జగన్ పాలనలో ప్రజలందరూ ఆనందంగా, ఆరోగ్యంగా వున్నారన్నారు. అందుకే మరలా జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలన్నారు. మాజీ మంత్రి పి.బాలరాజు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎమ్మెల్సీతో పాదయాత్ర చేసి సంఘీభావం తెలిపారు. పీఏసీఎస్ చైర్‌పర్సన్ లత, వైస్ ఎంపీపీ పల్లేల స్వామి, పార్టీ నాయకులు కేశనకుర్తి సత్తిబాబు, మండల కోఆప్షన్ సభ్యుడు కాధా రామకృష్ణ, ధనిశెట్టి బుజ్జి, ధనిశెట్టి మహేష్, గోసల కృష్ణ పాల్గొన్నారు. కాగా రఘురాజు స్థానిక పీఆర్ అతిథిగృహంలో రాత్రి బస చేశారు.



ఎమ్మెల్సీ రఘురాజుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

సేంద్రియ సాగుపై పరిశోధనలు ముమ్మరం

అనకాపల్లిటౌన్: స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానంలో జాతీయ వ్యవసాయ ఉన్నత విద్యాపథక ఆధ్వర్యంలో బుధవారం 30 మంది శాస్త్రవేత్తలకు సేంద్రియ, సహజ సేంద్రియ సాగు విధానం అంశంపై 10 రోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు ఏడీఆర్ పి.వి.కె.జగన్నాథరావు చెప్పారు. ఈ శిక్షణ కార్యక్రమం ఈనెల 24వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. తొలిరోజు రసాయన ఎరువులు, పురుగుమందుల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, పర్యావరణ కాలుష్య నివారణపై శిక్షణ ఇచ్చారు. ప్రస్తుత తరుణంలో సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని, సేంద్రియ విధానంలో సాగు చేసిన ఆహార వినియోగం పెరుగుతుందన్నారు. ఈ దిశగా జీవన ఎరువులు, జీవకీటక నాశినులు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానంలో అందుబాటులో ఉన్నట్టు చెప్పారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎం.ప్రశాంతి వర్చువల్ విధానంలో మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంపై పరిశోధనలు గత 15 ఏళ్ల క్రితమే ప్రారంభించినా ప్రస్తుతం పరిశోధనలు ముమ్మరం చేసినట్టు చెప్పారు. సేంద్రియ విధానంలో సాగు చేసిన ఆహారధాన్యాలు విదేశాలకు ఎగుమతి పెరిగిందని వివరించారు. డాక్టర్ కరుణాసాగర్ మాట్లాడుతూ సేంద్రియ సాగు విధానాల ద్వారా నేల ఆరోగ్య పరిరక్షణ సాధించవచ్చన్నారు. శిక్షణ సంచాలకులు రామలక్ష్మి మాట్లాడుతూ సేంద్రియ సాగు విధానాలకు భారత దేశం పుట్టినిల్లు అన్నారు. ఇటీవల కాలంలో సేంద్రియ సాగు చేసే రైతుల సంఖ్య పెరిగిందని తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యులు పి.గురుమూర్తి, సాయిలక్ష్మి మాట్లాడారు. చెరకు ప్రధాన శాస్త్రవేత్త ఆదిలక్ష్మి, శాస్త్రవేత్తలు రామలక్ష్మి, రమణమూర్తి, ముకుందరావు, ఎం.బి.జి.ఎస్.కుమారి, ఉమామహేశ్వరరావు, శిరీష, సరిత, విశాలాక్షి, గోపాలస్వామి, పద్మావతి పాల్గొన్నారు.



సేంద్రియ సాగు విధానంపై పుస్తకావిష్కరణలో జగన్నాథరావు

పంచ శైవ క్షేత్రాలకు, శబరిమలకు ప్రత్యేక బస్సులు

జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి పద్మావతి

అనకాపల్లిటౌన్: కార్తీక మాసంలో పంచ శైవక్షేత్రాలు దర్శించుకునే భక్తులకు నాలుగు ఆదివారాలు ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా శాఖ(ఆర్టీసీ) అధికారి కె.పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల కోరిక మేరకు అనకాపల్లి డిపో నుంచి ఈ నెల 20, 27, డిసెంబర్ 4, 11 తేదీల్లో పంచ శైవ క్షేత్రాలకు బస్ సర్వీసులు నడుస్తాయన్నారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లు ఆదివారం సాయంత్రం అనకాపల్లి డిపో నుంచి బయలుదేరి సోమవారం రాత్రి డిపోకు చేరుతాయన్నారు. అనకాపల్లి నుంచి అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట పుణ్యక్షేత్రాలను ఒక్కరోజులో దర్శించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. బస్సు మొత్తాన్ని ఒకే గ్రామం నుంచి బుక్ చేసుకుంటే ఇద్దరు భక్తులను ఉచితంగా అనుమతిస్తామన్నారు. పల్లె వెలుగు సర్వీస్ పెద్దలకు రూ.1,100, ఎక్స్‌ప్రెస్ సర్వీస్ పెద్దలకు రూ.1,250 చొప్పున చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్తీక మాసంలో వివిధ ప్రాంతాలకు పిక్నిక్‌లకు వెళ్లే వారికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడంతోపాటు, స్కూల్ విద్యార్థులకు ప్రత్యేక ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయన్నారు.

శబరిమల యాత్రకు ప్రత్యేక సర్వీసులు

అనకాపల్లి డిపో నుంచి శబరిమల యాత్రకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నట్లు పద్మావతి తెలిపారు. 5 రోజుల ప్యాకేజీ సూపర్ లగ్జరీ బస్‌లకు ఒక్కొక్కరికి రూ.6,600, 6 రోజుల ప్యాకేజీ రూ.7 వేలు, 7 రోజుల ప్యాకేజీ రూ.7,500లు ఛార్జీలుగా చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు 73829 13967, 86394 31199, 99592 25595 నంబర్లను సంప్రదించాల్సిందిగా కోరారు.